


ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news


హైదరాబాద్
10-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 09
సంచిక: 241

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## ఎట్టకేలకు తమిళనాడు
# ఉత్కంఠకు తెర

**తమిళనాడు కొత్త సిఎంగా విజయ్..విజయ్‌ను నియమిస్తూ గవర్నర్ ఉత్తర్వులు**

- నేడు పది గంటలకు సిఎంగా విజయ్ ప్రమాణం
- మద్దతు లేఖలు సమర్పణ..గంటన్నరకు పైగా చర్చలు
- గవరనర్ లేఖతో బయటకు వచ్చిన టివికె అధినేత
- 13లోగా మెజార్టీ నిరూపించుకోవాలని గవర్నర్ సూచన
- ప్రభుత్వానికి బయటనుంచి మద్దతుకు చిన్న పార్టీల నిర్ణయం



## నేడు ప్రధాని మోడీ రాక

**నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధింపు**



**హైదరాబాద్, ప్రభాత సూర్య** :భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం భాగ్యనగర పర్యటనకు రానున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభలో మోడీ పాల్గొని ప్రసంగించ నున్నారు.

2లో



# బెంగాల్ సిఎంగా సువేందు అధికారి

**ఆయనతోపాటు ఐదుగురు మంత్రుల ప్రమాణం**

- ప్రమాణం చేయించి గవర్నర్‌ఆర్‌ఎన్ రవి
- హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు
- చంద్రబాబు సహా పలు రాష్ట్రాల సిఎంలు హాజరు

**కోల్‌కతా, ప్రభాత సూర్య** :పశ్చిమ బెంగాల్‌లో మొట్టమొదటిసారి కమలదళ సర్కారు కొలువుదీరింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా భాజపా నేత సువేందు అధికారి శనివారం ప్రమాణస్వీకారం



## గుంటనక్క కమీషన్లు మింగేసింది..

- బీఆర్‌ఎస్‌పై కవిత తీవ్ర ఆరోపణలు
- ప్రాజెక్టుల పేరుతో బీఆర్‌ఎస్ కమీషన్లు దండుకుందన్న కవిత
- రూ.33 వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు నీళ్లివ్వలేదని ఆరోపణ
- రేవంత్ ప్రభుత్వం కూడా బిల్లులు చెల్లించి కమీషన్లు తీసుకుందన్న టీఆర్‌ఎస్ చీఫ్
- దసరాలోపు పనులు మొదలుపెట్టకపోతే పాదయాత్ర చేస్తానని హెచ్చరిక
- అధికారంలోకి వస్తే 10 లక్షల ఎకరాలకు నీళ్లిస్తామని హామీ

2లో



# పట్టణ జనాభాకు అనుగుణంగా వసతులు

- సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ అభివృద్ధి
- రోడ్ల విస్తరణతో పాటు మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సిఎం రేవంత్

**ఆధునీకరణ, పట్టణీకరణతో భవిష్యత్తులో మరిన్ని కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.**

**హైదరాబాద్, ప్రభాత సూర్య** :హైదరాబాద్ నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సిగ్నల్ ఫ్రీ సిటీగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలతో ముందుకు వెళు తున్నామన్నారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అండర్ పాస్, సర్ఫేస్, ఎలివేటెడ్ అనే త్రీ లెవెల్ విధానాన్ని తీసుకురావాలని నిర్ణయించు కున్నామని

## కేరళంపై కాంగ్రెస్ మల్లగుల్లాలు

**సిఎం ఎవరనేదానిపై తేల్చుకోలేని పార్టీ**

**నేడు స్పష్టత వచ్చే అవకాశం ఉందన్న పార్టీ నేతలు**



2లో

## కాళేశ్వరంను తక్కువ చేసే యత్నం

- అధికారంలో ఉండగా ప్రాణహిత కోసం చేసిందేమీ లేదు
- కెసిఆర్ ముందుచూపుతోనే కాళేశ్వరం నిర్మాణం
- బిఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శలు

**సిద్దిపేట,మే9:**కటిక చీకట్లోనూ కారుదీపం లాంటిది కాళేశ్వరం అని హరీశ్‌రావు తెలిపారు. ఎంత కరవు వచ్చినా నదిలో నీళ్లు ప్రవహించే సత్తా మేడిగడ్డకు ఉందని పేర్కొన్నారు. కేసీఆర్ ముందుచూపుతో ఆలోచించి కాళేశ్వరం నిర్మాణం చేపట్టారని అన్నారు. కాళేశ్వరం



2లో

## బండి సంజయ్ కుమారుడు చుట్టూ వివాదం

- హనీ ట్రాప్ అంటున్న బండి భగీరథ్
- మైనర్ను వేధించాడంటూ ఎదురు ఫిర్యాదు
- ప్రధాని పర్యటన వేళ ట్విస్ట్



**ప్రభాత సూర్య తెలంగాణ బ్యూరో** : ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన వేళ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కు షాక్ తగిలింది. ఆయన కుమారుడు చుట్టూ కొత్త వివాదం తెరపైకి వచ్చింది. హనీ డ్రాప్ వివాదం

## 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా విశాఖ అభివృద్ధి

- రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కి.మీ మేర రింగు రోడ్డు
- వీఎంఆర్డీఏ మాస్టర్‌ప్లాన్‌పై మంత్రి నారాయణ సమీక్ష

**విశాఖపట్నం, ప్రభాత సూర్య** : రానున్న 50 ఏళ్లలో విశాఖ నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సెమీ రింగురోడ్డు నిర్మిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ అన్నారు. రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కి.మీ మేర రింగు రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పారు. వీఎంఆర్డీఏ మాస్టర్‌ప్లాన్‌పై మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి అధికారులతో నారాయణ సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు.



# పట్టణ జనాభాకు అనుగుణంగా వసతులు

చెప్పారు.ట్రాఫిక్ నియంత్రణకు కేవలం రోడ్ల విస్తరణ మాత్రమే సరిపోదని.. మల్టీ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం వెల్లడించారు. పార్కింగ్ ఇబ్బందులను అధిగమించేందుకు నగరంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రాన్ని మూడు భాగాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ఫ్యూర్,క్యూర్, రేర్ అభివృద్ధిని మూడు భాగాలుగా విభజించుకున్నామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు ఏరియాను సర్వీస్ సెక్టార్‌గా గుర్తించా మన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు బయట, రీజనల్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ఏరియాను మాన్యూఫ్యాక్చర్ సెక్టార్‌గా గుర్తించామని తెలిపారు. రీజనల్ రింగ్ రోడ్డు బయట ఉన్న ఏరియాను అగ్రికల్చర్ సెక్టార్‌గా గుర్తించామని అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి సంబంధించి తెలంగాణ రైజింగ్-2047 మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరించుకున్నామని ముఖ్యమంత్రి అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేయడంతో పాటు మన సంస్కృతికి అనుసంధానం చేయబోతున్నట్లు తెలిపారు. నగరంలో కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఆర్టీసీలో ఈవీ బస్సులను తీసుకొస్తున్నామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఆటోలకు ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేయించి ఈవీ వాహనాలుగా మార్చబోతున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఆధునికీకరణ, పట్టణీకరణతో భవిష్యత్‌లో మరిన్ని కొత్త సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో నిర్వహించిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు హాజరయ్యారు. గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాలపై సమావేశంలో చర్చించారు.

## 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా విశాఖ అభివృద్ధి

నగరం అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ అవసరం. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించాం. మాస్టర్‌ప్లాన్ అంశంలో వచ్చిన వినతులపై ఈ సమావేశంలో చర్చించాం. ఎమ్మెల్యేల నుంచి అందిన వినతుల్లో 90 శాతం పరిష్కరించాం. 6,836 చదరపు కి.మీ పరిధిలో వీఎంఆర్డీఏ విస్తరించి ఉంది. ఈనెల చివరి నాటికి సెమీ రింగురోడ్డు డీపీఆర్ సిద్ధమవుతుంది. భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఏడు కనెక్టింగ్ రోడ్లను వీఎంఆర్డీఏ నిర్మిస్తోంది. ఇప్పటికే మూడు పూర్తయ్యాయి. భోగాపురం ఎయిర్‌పోర్టుకు బీచ్ కారిడార్ ప్రతిపాదన ఉంది. రూ.14వేల కోట్లతో తాగునీటి ప్రాజెక్టు వస్తోంది. ఇది పూర్తయితే 95 శాతం ఇళ్లకు తాగునీరు అందుతుందని మంత్రి నారాయణ వివరించారు. మాస్టర్ ప్లాన్ మేరకు విశాఖ పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. నగరం అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ అవసరమని ఆయన తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించామమని మంత్రి వెల్లడించారు. 'నగరం అభివృద్ధి చెందాలి అంటే మాస్టర్ ప్లాన్ అవసరం. 6,836 చదరపు కి.మీ పరిధిలో వీఎంఆర్డీఏ ఉంది. 4,387.36 చదరపు కిలోమీటర్ల పరిధిలో మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. మిగిలిన ప్రాంతంలో రానున్న అక్టోబర్ నెలకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తాం. వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌పై వచ్చిన వినతులపై సమీక్షలో చర్చ జరిపాం. ఎమ్మెల్యేలు తీసుకువచ్చిన వినతులు 90 శాతం పైగా పరిష్కారం చూపాం. 2021లో రూపొందించిన మాస్టర్ ఎ÷-లాన్‌ను రీవిజిట్ చేయాలని ప్రజా ప్రతినిధులు సీఎంను కోరారు. దీనిపై భారీ ఎత్తున అభ్యంతరాలు వచ్చాయి. తొలుత 3720 అభ్యంతరాలు రాగా రెండవసారి 1236 అభ్యంతరాలు వచ్చాయి. సమీక్షకు హాజరుకాని ఎమ్మెల్యేలతో చర్చించి మాస్టర్ ప్లాన్ ప్రకటిస్తాం' అని మంత్రి నారాయణ తెలిపారు. హైదరాబాద్ తరహాలో విశాఖలో సెమి రింగ్ రోడ్డు నిర్మించాలని సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కి.మీ మేర సెమి రింగ్ రోడ్డు నిర్మాణం. ఈనెల చివరికి సెమి రింగ్ రోడ్డు డీపీఆర్ సిద్ధం అవుతుంది. అలానే భోగాపురం విమానాశ్రయంకు బీచ్ కారిడార్ ప్రతిపాదన ఉంది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఎస్టీపీలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రాపర్టీ టాక్స్ విషయంలో పాత విధానాన్ని కొనసాగిస్తున్నాం' అని మంత్రి నారాయణ వెల్లడించారు.మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ ఎకనామిక్ కారిడార్ ఆధారంగా సమీక్ష సమావేశం జరిగిందని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రత్యేక అభివృద్ధి జోన్‌గా మారుతోందన్నారు.

## ఎట్టకేలకు తమిళనాడు ఉత్కంఠకు తెర

చెన్నై,మే9: తమిళనాడు రాజకీయాల్లో అనిశ్చితి వీడింది. సిఎంగా జోసెఫ్ విజయ్ నియమితులయ్యారు. దీంతో ఆయన నేడు ఉదయం పదిగంటలకు తమిళనాడు సిఎంగా ప్రమాణం చేయనున్నారు. నెహ్రూ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత నాలుగు రోజుల ఉత్కంఠకు తెరదించుతూ శనివారం గవర్నర్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ప్రకటన చేశారు. అంతకుముందు విజయ్ తన అనుచరులతో కసలి గవర్నర్ను కలిసి చర్చించారు. తనకు మద్దతు ఇస్తున్న పార్టీల లేఖలను అందించారు. దీంతో సంతృప్తి చెందిన గవర్నర్ జోసెఫ్ విజయ్‌ను సిఎంగా నియమిస్తూ లేఖలను అందించారు. దాదాపు గంటా నలభై నిముషాలు వీరి భేటీ జరిగింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కీలక మలుపులు తిరిగిన అత్యధిక స్థానాలు గెలిచిన విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతు తెలపడంతో ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ లైన్ క్లియర్ చేశారు. ఈ మేరకు తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్‌ను నియమిస్తూ లోక్‌భవన్ ఓ ప్రకటన విడుదల చేసింది. శనివారం గవర్నర్‌ను కలిసి తమకు మద్దతిచ్చిన పార్టీల లేఖలను అందజేసి ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ కోరారు. మెజార్టీ మార్క్ (118)కు చేరుకోవడంతో గవర్నర్ సమ్మతించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియం వేదికగా టీవీకే చీఫ్ విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మే 13వ తేదీలోగా బల నిరూపణ చేసుకోవాలని సూచించారు. దీంతో ఇక తమిళనాడులో విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం ఈనెల 10న కొలువు తీరనుంది. గవర్నర్ అపాయిమెంట్ ఇవ్వడంతో శనివారం సాయంత్ర లోక్‌భవన్‌లో ఆయనను విజయ్ కలుసుకున్నారు. టీవీకేకు మద్దతిస్తున్న కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, వీసీకే, ఐయూఎంఎల్ నేతలు కూడా విజయ్ వెంట గవర్నర్‌ను కలిశారు. ఎమ్మెల్యేల మద్దతు లేఖలను విజయ్ గవర్నర్‌కు అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించాలని కోరారు. ఇందుకు గవర్నర్ సమ్మతించారు.చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ప్రమాణస్వీకార కార్యక్రమం ఏర్పాటు చేశారు. విజయ్‌తో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. తదుపరి మంత్రి వర్గ విస్తరణలో భాగస్వామ్య పార్టీలకు అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. ఈనెల 4న వెలువడిన ఫలితాల్లో విజయ్ టీవీకే 108 సీట్లతో ఏకైక పెద్దపార్టీగా నిలిచింది. అయితే ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 118 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం లేకపోవడంతో ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించిన గవర్నర్ మూడుసార్లు విజయ్‌కు అనుమతి నిరాకరించారు. ఈనెల 10వ తేదీతో గవర్నర్ ఇచ్చిన గడువు ముగియనుండటంతో ఉత్కంఠ కొనసాగుతూ వచ్చింది. రెండు చోట్ల నెగ్గిన విజయ్ ఒకచోట వదులుకోవాల్సి ఉండటంతో టీవీకే బలం 107కు చేరింది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు, వామపక్షాల నుంచి నలుగురు ఎమ్మెల్యేలు మద్దతు ఇవ్వడంతో అది 116కు చేరింది. అయితే మరో ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతుపై సస్పెన్స్ కొనసాగుతూ వచ్చింది. ఎట్టకేలకు ఇద్దరు ఎమ్మెల్యేలున్న వీసీకే బేషరతుగా టీవీకేకు మద్దతు తెలిపింది. దీంతో పూర్తి సంఖ్యాబలం చేకూరిన విజయ్ నాలుగోసారి గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరారు. అయితే అప్పుడు కూడా సస్పెన్స్ కొనసాగింది. కేరళ పర్యటన ఉండటంతో గవర్నర్ అందుబాటులో లేరని చెప్పిన లోక్‌భవనన్ వర్గాలు ఆ తర్వాత కొద్దిసేపటికే గవర్నర్ పర్యటన రద్దయిందంటూ అపాయింట్‌మెంట్ ఖరారు చేసింది. దీంతో నాలుగోసారి గవర్నర్‌ను కలిసిన విజయ్ పూర్తి సంఖ్యాబలాన్ని గవర్నర్ ముందుంచారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది. ప్రభుత్వ ఏర్పాటులో టీవీకేకు మద్దతు ఇస్తున్న వీసీకే.. క్యాబినెట్ బెర్తులు మాత్రం వద్దని చెప్పింది. 'మేం ప్రభుత్వంలో చేరబోం. వెలుపలి నుంచే మద్దతు ఇస్తాం. భవిష్యత్‌లో ప్రభుత్వంలో భాగం అవుతామా లేదా..? అన్నది చెప్పలేం. రాష్ట్రపతి పాలనను నివారించేందుకు, ప్రజల తీర్పును నెరవేరేలా చేసేందుకు ప్రభుత్వ ఏర్పాటులో భాగం అవుతున్నాం' అని వీసీకే చీఫ్ తిరుమావళవన్ మీడియాకు వెల్లడించారు. తాము ఇప్పటికీ డీఎంకే నేతృత్వంలోని కూటమిలోనే ఉన్నామని వీసీకే, ఐయూఎంఎల్ వెల్లడించడం గమనార్హం. ఇప్పటికే వామపక్షాలు కూడా క్యాబినెట్ పదవులు వద్దని చెప్పిన విషయం తెలిసిందే. ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో చెన్నై సమీపంలో టీవీకే ఎమ్మెల్యేలు ఉంటున్న రిసార్ట్ బయట భద్రతను భారీగా పెంచారు. ప్రస్తుతం విజయ్‌కు మద్దతు ఇస్తున్న సభ్యుల సంఖ్య 120కి చేరింది.పార్టీల వారీగా సంఖ్యాబలం ఇలా ఉన్నాయి. టీవీకే : 107, కాంగ్రెస్ : 5, సీపీఐ : 2, సీపీఎం : 2, వీసీకే : 2, ఐయూఎంఎల్: 2 ఉన్నాయి.

## కేరళంపై కాంగ్రెస్ మల్లగుల్లాలు

**న్యూఢిల్లీ/ తిరువనంతపురం:** తమిళనాట ముఖ్యమంత్రి పదవిపై ఏర్పడిన సందిగ్ధత వీడడంతో ఇప్పుడు అందరి దృష్టి పొరుగు రాష్ట్రం కేరళపై పడింది. ఫలితాలు వెలువడి ఐదు రోజులు గడుస్తున్నా.. సీఎం ఎవరనే దానిపై ఇంకా స్పష్టతరాలేదు. సీఎం ఎంపికపై దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన సమావేశం జరిగినప్పటికీ.. సీఎం పేరును మాత్రం వెల్లడించలేదు. దీంతో ఆదివారం దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ విజయఢంకా మోగించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పర్యటించిన ఏఐసీసీ పరిశీలకులు ముకుల్ వాస్నిక్, అజయ్ మాకెన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు శుక్రవారం నివేదిక సమర్పించారు. ఈ క్రమంలోనే శనివారం సాయంత్రం 4 గంటలకు ఖర్గే నివాసంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి రాహుల్ గాంధీ, కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్, సీఎం పదవి రేసులో ఉన్న వీడీ సతీషన్, కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితల హాజరయ్యారు. కీలక సమావేశం ముగిసిన అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ మీడియాతో మాట్లాడారు. సీఎం అభ్యర్థి ఎవరనే దానిపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు సంయమనం పాటించాలని కోరారు. నాయకత్వ ఎంపికపై అధిష్ఠానం సమష్టిగా నిర్ణయం తీసుకుంటుందన్నారు. మరోవైపు సీఎం ఎవరనేది ప్రకటించే ముందు మరోసారి చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## నేడు ప్రధాని మోడీ రాక

ప్రధాని పర్యటన నేపథ్యంలో అటు పోలీసులు, ఇటు ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాయి. ప్రధాని మోదీ ఆదివారం మధ్యాహ్నం 2:50 నిమిషాలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా సభ జరిగే పరేడ్ గ్రౌండ్స్‌కు బయలుదేరుతారు.ప్రధాని పర్యటనను దృష్టిలో ఉంచుకుని పోలీసులు అత్యంత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో మూడంచెల భద్రతా వలయాన్ని నిర్మించారు. సుమారు 2,000 మందికి పైగా పోలీసులతో పాటు, ప్రత్యేక రక్షణ బృందాలు, స్నైపర్లు, ముఫ్తీ పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్స్ రంగంలోకి దిగాయి. ప్రధాని పర్యటన, బహిరంగ సభ కారణంగా సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ముఖ్యంగా బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పరేడ్ గ్రౌండ్స్ వరకు వెళ్లే ప్రధాన రహదారులతో పాటూ సికింద్రాబాద్ పరిసరాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించనున్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు

## బెంగాల్ సిఎంగా సువేందు అధికారి

చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సువేందు చేత బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రమాణం చేయించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర 9వ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. అగ్నిమిత్ర పాల్, దిలీప్ ఘోష్, అశోక్ కిర్తానియా, నిశిత్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రులు జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, రేఖా గుప్తా, భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం సృష్టించిన సంగతి తెలిసిందే. బీజేపీ 207 స్థానాల్లో ఘన విజయం సాధించింది. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ 80 సీట్లకే పరిమితం అయింది. సువేందు అధికారి రెండు చోట్ల పోటీ చేశారు. నందిగ్రామ్, భవానీపూర్ నుంచి ఆయన బరిలో నిలిచారు. భవానీపూర్ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం కావటం విశేషం. సువేందు భవానీపూర్‌లో మమతాపై 15 వేల ఓట్ల మెజార్టీతో గెలుపు సాధించారు. అవివాహుతుడైన 55 ఏళ్ల సువేందు.. బెంగాల్ కు 9వ సీఎంగా ప్రమాణం చేశారు. ఈ పదవి చేపట్టిన తొలి భాజపా నేతగా అరుదైన చరిత్ర సృష్టించారు. 1970 డిసెంబరు 15న బెంగాల్ తూర్పు మేదినీపూర్ జిల్లాలో సువేందు జన్మించారు. 1998లో మమతా బెనర్జీ స్థాపించిన తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అప్పటినుంచి దీదీకి నమ్మినబంటులా మారారు. 2004లో తమలుక్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2006లో తొలిసారి కాంథీ దక్షిణ్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత రెండుసార్లు ఎంపీగా గెలిచి లోక్‌సభకు వెళ్లారు.గతంలో మమతా బెనర్జీ క్యాబినెట్‌లో మంత్రిగా పని చేశారు. మమత మేనల్లుడి కారణంగా ఆమెతో విభేదించి.. 2020లో టీఎంసీని వీడి కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. అప్పటినుంచి రాష్ట్రంలో భాజపాను ముందుండి నడిపించారు. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పార్టీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో, తాజా ఎన్నికల్లో భవానీపూర్‌లో మమతా బెనర్జీని రెండుసార్లు ఓడించి సంచలనం సృష్టించారు.

## గుంటనక్క కమీషన్లు మింగేసింది..

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేశాయని, కమీషన్ల కోసం ప్రాజెక్టును బలిపెట్టాయని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా జిల్లేడ్-చౌదరిగూడలో శుక్రవారం నిర్వహించిన 'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభ'లో ఆమె మాట్లాడారు. ఆంధ్రోళ్లను తిట్టి ఓట్లు దండుకున్న బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రాజెక్టుల పేరుతో దోపిడీకి పాల్పడిందని విమర్శించారు. "ప్రాజెక్టు కోసం రూ.33 వేల కోట్లు ఖర్చు చేసినా కనీసం 33 ఎకరాలకు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం నీరు అందించలేకపోయింది. ఓ గుంటనక్క కమీషన్ల కోసం కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ప్రాజెక్టు డిజైన్ మార్చింది. జూరాల నుంచి శ్రీశైలానికి సోర్స్ పాయింట్ మార్చడం క్షమించరాని నేరం" అని కవిత మండిపడ్డారు. ఈ మార్పు వల్లనే ఆంధ్రప్రదేశ్‌తో వివాదాలు తలెత్తుతున్నాయని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనా కవిత విమర్శలు గుప్పించారు. 'నల్లమల పులి బిడ్డ'నని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టు పనుల్లో తట్టెడు మట్టి కూడా ఎత్తిపోయలేదని ఎద్దేవా చేశారు. కానీ, ప్రాజెక్టు పేరుతో రూ.6 వేల కోట్ల బిల్లులు చెల్లించి కమీషన్లు తీసుకున్నారని, ఇందులో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కూడా వాటా ఉందని సంచలన ఆరోపణలు చేశారు. దసరాలోపు పనులు ప్రారంభించకపోతే పాదయాత్ర చేసి కాంగ్రెస్‌ను ఎండగడతామని హెచ్చరించారు. తాము అధికారంలోకి వస్తే పాలమూరు-

## కాళేశ్వరంను తక్కువ చేసే యత్నం

ప్రాజెక్టును తక్కువ చేసి మాట్లాడితే తెలంగాణకు ద్రోహం చేసినట్లే అవుతుందని అన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ నీటి సౌలభ్యతను తక్కువ చేసి మాట్లాడకండి అని హితవు పలికారు. జలహారతి అంటూ డ్రామాలు తప్ప కాంగ్రెస్‌లో నిజాయితీ లేదని విమర్శించారు. ఆనాడు ఏడున్నరేళ్లు.. ఈనాడు రెండున్నరేళ్లు కాంగ్రెస్ డ్రామాలు చేసిందని మండిపడ్డారు. మేడిగడ్డ మరమ్మతు చేసి సాగు, తాగు నీళ్లు ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. నాలుగేళ్లలో ప్రాణహితను పూర్తి చేస్తామని చెప్పి.. ఇప్పటివరకు తట్టెడు మట్టి తీయలేదని హరీశ్‌రావు మండిపడ్డారు. 2024-25 బ్జడెట్‌లో ప్రాణహితకు రూ.2కోట్లు కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. 2025-26 బడ్జెట్‌లో ప్రాణహితకు రూ.30కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రాణహిత చేవెళ్లకు పెట్టింది రూ.50కోట్లు అని అన్నారు. తిప్పి తిప్పి రూ.84 కోట్లే కేటాయించారని.. వీటితో ప్రాణహిత పూర్తవుతందా అని ప్రశ్నించారు. నిజంగానే కట్టే ఆలోచన ఉంటే బ్జడెట్‌లో నిధులు పెంచాలి కదా అని నిలదీశారు. ప్రాణహితకు సంబంధించి రూ.11వేల కోట్ల పనులు పూర్తయ్యాయని నిన్న రేవంత్ రెడ్డి అబద్దాలు చెప్పాడని మండిపడ్డారు. అసలు కాంగ్రెస్ హయాంలో భూసేకరణ, పనునలకు అయిన ఖర్చు రూ.3708 కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి చెబుతున్న అబద్దాలకూ హద్దూ పద్దూ ఉండాలని అన్నారు. ఆనాడు జలయజ్ఞం కాదు.. ధన యజ్ఞం అన్న రేవంత్ ఇవాళ గొప్పలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. ఊసరవెల్లిలా రేవంత్ రెడ్డి రంగులు మారుస్తున్నాడని మండిపడ్డారు. 30 నెలలుగా కుంగిన మేడిగడ్డ పిల్లర్లను మరమ్మతు చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండుటెండల్లోనూ 6400 క్యూసెక్కుల నీరు పోతుందని అన్నారు.

## బండి సంజయ్ కుమారుడు చుట్టూ వివాదం

సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. తనను బ్లాక్ మెయిల్ చేస్తూ ఐదు కోట్లు డిమాండ్ చేస్తున్నారని బండి భగీరథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే సమయంలో ఆయనపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలన్న ఫిర్యాదు కూడా వచ్చింది. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనకు ముందు ఈ ఘటన జరగడం రాజకీయంగాను ప్రాధాన్యత సంతరించుకుంది. దీని వెనుక రాజకీయ కారణాలు ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.

**కరీంనగర్ లో ఫిర్యాదు..**

తనపై హనీ ట్రాప్ జరిగింది అంటూ బండి భగీరథ్ కరీంనగర్ 2 టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. హైదరాబాద్ కు చెందిన ఒక కుటుంబం తనను ట్రాప్ చేసి భారీ మొత్తంలో నగదు వసూలు చేసేందుకు ప్రయత్నించింది అంటూ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తన సాధారణ మిత్రుల ద్వారా పరిచయమైన సదరు యువతీతో తాను కొన్నాళ్లు చాటింగ్ చేశానని.. ఆ తరువాత తనను పెళ్లి చేసుకోవాలని ఆమె తల్లిదండ్రులు ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. అందుకు తాను నిరాకరించడంతో ఇప్పుడు తప్పుడు కేసులు పెడతామని బెదిరిస్తున్నారని.. ఇప్పటికే భయంతో ఓ 50 వేల రూపాయలు చెల్లించానని.. ఇప్పుడు ఏకంగా ఐదు కోట్ల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని.. లేకుంటే ఆ యువతీ తల్లి ఆత్మహత్య చేసుకుంటానని బ్లాక్మెయిల్ చేస్తున్నారంటూ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

**ఫోక్సో కేసు నమోదు చేయాలని..**

మరోవైపు బండి భగీరథ్ ఆరోపణలు చేస్తున్న ఆ కుటుంబం సైతం హైదరాబాదులోని ఓ పోలీస్ స్టేషన్లో భగీరథ్ పై తిరిగి ఫిర్యాదు చేశారు. సదరు యువతి మైనర్ అని.. ఆమెను భగీరథ్ వేధించే వారిని ఆరోపిస్తూ ఫోక్సొ చట్టం కింద కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఇదే కుటుంబం నిర్మల్ పోలీస్ స్టేషన్ పరిధిలో తన స్నేహితులను కూడా ఇలాగే వేధించిందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## తెల్లాపూర్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో

# పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**పటాన్ చెరువు, మే 9, టప్రభాత సూర్య :** ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ లలిత సోమిరెడ్డి, నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి లను ఘనంగా సన్మానించిన విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు. సంగారెడ్డి జిల్లా, పటాన్ చెరువు నియోజకవర్గం, తెల్లాపూర్ డివిజన్ పరిధిలో ఉన్న శ్రీశ్రీశ్రీ గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అధ్యక్షుడు శ్రీశైలం చారి, ఉపాధ్యక్షుడు ప్రకాశం చారి, భీమా చారి మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ప్రథమ వార్షికోత్సవా కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, అల్లంపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ లలిత సోమిరెడ్డి, నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, విచ్చేసి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దర్శించుకుని తీర్థప్రసాదాలు తీసుకున్నారు. అనంతరం ఇరువురు మాట్లాడుతూ మా విశ్వబ్రాహ్మణ కుటుంబ సభ్యులందరము తెల్లాపూర్ మున్సిపల్ చైర్మన్ లలిత సోమిరెడ్డి కలసి మాకు తెల్లాపూర్ గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయము మీ సహకారాలతో మాకు మందిరాన్ని నిర్మించి ఇవ్వాలని కోరగా వెంటనే పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దగ్గరికి తీసుకువెళ్లి ఆలయ నిర్మాణం గురించి వివరించగా వెనువెంటనే మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ని పిలిపించి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేయించడమే కాకుండా ఆలయ నిర్మాణానికి దాతలతో సహా కలిసి నిర్మాణ భాగంలో భాగమయ్యారు, ఆనాటి నుండి ఈరోజు వరకు శ్రీశ్రీశ్రీ గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రకరకాలుగా పూజలు అందుకుంటూ భక్తులకు దర్శమిస్తున్నాడు ఈరోజు ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గణపతి హోమం,చండీయాగం, స్వామికి అభిషేకాలు అనంతరం కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించాము వందలాది భక్తులు విచ్చేసి స్వామివారి దర్శించుకుని అన్నదాన ప్రసాద వితారణ కార్యక్రమంలో పాల్గొన్నారు.సమాజ నిర్మాణంలో విశ్వబ్రాహ్మణుల సేవలు అత్యంత ప్రశంసనీయమని.. వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మరియు తెల్లాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ లలిత సోమరెడ్డిని ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు శ్రీశైలం చారి, ఉపాధ్యక్షులు భీమా చారి, ప్రకాశం చారి, గోపాల్ చారి, ఆలయ కమిటీ సభ్యులు,విశ్వబ్రాహ్మణ సంఘం పెద్దలు, యువకులు, విశ్వకర్మ కుటుంబ సభ్యులు, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, మల్లారెడ్డి, దేవేందర్ యాదవ్, లచ్చి రామ్ నాయక్, బాబ్జి, శ్రీశైలం, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## కుక్కడం గ్రామం లో ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నల్లబోతు భాస్కర్ రావు



ప్రభాత సూర్య మాడుగుల పల్లి (మే 09)ప్రతినిధి : మాడ్గులపల్లి మండలం కుక్కడం మిర్యాలగూడ మండలం సౌమ్య గాని తండ గ్రామములో నిర్వహించిన అభయ ప్రసన్నాంజనేయ స్వామీ వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజా కార్యక్రమాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం సమాజంలో ఐక్యత, భక్తి భావాలను పెంపొందిస్తాయని తెలిపారు. శ్రీ అభయ ప్రసన్నాంజనేయ స్వామీ వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దుర్గంపూడి నారాయణరెడ్డి, కుందూరు వీర కోటిరెడ్డి, పాలుట్ల బాబయ్య,ఉర ప్రసన్న రాబర్ట్,అల్లుబెల్లి గోవింద్ రెడ్డి,గుదే శర్మ,సోములు, సైదా నాయక్, గోవిందు, కర్ర శ్రీనివాస్ రెడ్డి,మహేష్,శ్రీను,రామస్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రసన్నంజనేయ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు



**మిర్యాలగూడ మే :-( ప్రభాత సూర్య) :** మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామంలో నిర్వహించిన శ్రీ అభయ ప్రసన్నాంజనేయస్వామీ వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆలయ పూజా కార్యక్రమాలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం సమాజంలో ఐక్యత, భక్తి భావాలను పెంపొందిస్తాయని తెలిపారు. శ్రీ అభయ ప్రసన్నాంజనేయ స్వామీ వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పాలుట్ల బాబయ్య, ఉర ప్రసన్న, రాబర్ట్, అల్లుబెల్లి గోవింద్ రెడ్డి, గుదే శర్మ, సోములు, కర్ర శ్రీనివాస్ రెడ్డి, మహేష్, శ్రీను, రామస్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారమే ధ్యేయం లిఎమ్మెల్యే బిఎల్ఆర్




**మిర్యాలగూడ మే 9:-( ప్రభాత సూర్య) :** మిర్యాలగూడ పట్టణ ప్రజల దశాబ్దాల ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ ముమ్మర ప్రయత్నాలు చేయడంలో భాగంగా శనివారం రాత్రి సాగర్ రోడ్డుపై నూతనంగా నిర్మిస్తున్న డివైడర్ల పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక ఒన్ టౌన్, టూ టౌన్ ఇన్స్పెక్టర్ లు ఎం. నాగభూషణరావు, జె. సోమనర్సయ్య, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ పోలీసు అధికారులతో కలిసి ఆయన రహదారి పరిస్థితులను పర్యవేక్షించారు. గత నాలుగు రోజులుగా మారుతున్న ట్రాఫిక్ గమగమనాలు, కొత్త డివైడర్ల వల్ల కలుగుతున్న మార్పులను అధికారులతో కలిసి విశ్లేషించారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అదనపు సిబ్బంది అవసరమని గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ తో ఫోన్లో మాట్లాడారు మిర్యాలగూడకు అవసరమైన అదనపు పోలీస్ సిబ్బందిని వెంటనే కేటాయించాలని ఆయన కోరారు. కేవలం జరిమానాలు విధించడం కాకుండా, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కొత్తగా మారుతున్న నిబంధనల వల్ల వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.నో-పార్కింగ్ జోన్లలో వాహనాలు నిలపకుండా చూడాలని, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా వ్యాపారస్తులు నిర్దేశిత పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. పోలీసు యంత్రాంగం ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూనే, ట్రాఫిక్ నిబంధనలను అమలు చేయాలన్నారు. పర్యవేక్షణ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణ అభివృద్ధి, ప్రజల క్షేమమే మొదటి ప్రాధాన్యత ట్రాఫిక్ రద్దీని తగ్గించి, సురక్షిత ప్రయాణాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలు కూడా నిబంధనలను పాటించి అధికారులకు సహకరించాలని కోరారు. నేషనల్ హైవే నిబం ధనలు,?పట్టణ మాస్టర్ ప్లాన్లో భాగంగా చేపడుతున్న చర్యలు భవిష్యత్తులో మిర్యాలగూడ రూపురేఖలను మారుస్తాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కళాకారుడు జహంగీర్ కుటుంబానికి స్నేహితుల ఆదరణ

**తుర్కపల్లి ,మే 9 ప్రభాతసూర్య :** తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన జహంగీర్ మృతి పట్ల ఆయన స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజా ఉద్యమ గాయకుడిగా, సామాజిక చైతన్య కళాకారుడిగా ఎన్నో పోరాటాల్లో తన గళాన్ని వినిపించిన జహంగీర్ సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు స్నేహితులు కలిసి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు.జహంగీర్ ఆశయాలు, ప్రజల కోసం చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు.కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని, ఆయన స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తామని స్నేహితులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెండెం జ్ఞానేశ్వర్, ఇమ్మడి మల్లప్ప, కళ్యాణం కృష్ణ, సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సునీత, మంజుల, ఆంజనేయులు, ప్రభాకర్, గోపి, దుగ్యాల పాండురంగం తదితరులు పాల్గొన్నారు.



## అదృశ్యమైన వ్యక్తి కోసం కుటుంబ సభ్యుల ఆందోళన



**పటాన్చెరు, మే 9,ప్రభాత సూర్య :** పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన మహిపాల్ తన తమ్ముడు మహేష్ అదృశ్యమైన విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహేష్ వయస్సు సుమారు 40 సంవత్సరాలు. స్వస్థలం గౌడిచర్ల కాగా ప్రస్తుతం పటాన్‌చెరు పరిసరాల్లో నివసిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫిర్యాదు ప్రకారం మహేష్ మానసిక ఆందోళనతో బాధపడుతూ ఇంటి నుంచి బయటకు వెళ్లిన తర్వాత తిరిగి రాలేదు. ఈ నెల 6వ తేదీన మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతడు అప్పటి నుంచి కనిపించడం లేదని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఎలాంటి సమాచారం లభించలేదని తెలిపారు. మహేష్ ఎత్తు సుమారు ఐదు అడుగుల ఆరు అంగుళాలు ఉండగా, గోధుమ వర్ణం కలిగి ఉన్నాడని కుటుంబ సభ్యులు వివరించారు. అతడి ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# జనగణనలో బీసీ కులగణన చేయాలని ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు కి సంఘీభావం ప్రకటించిన ఈసీ

## జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

**ప్రభాత సూర్య మాడుగుల పల్లి (మే 09)ప్రతినిధి :** జనగణనలో బీసీలను కూడా లెక్కించాలని కోరుతూ ఈరోజు హైదరాబాదులోని అంబర్పేటలోనీ తన నివాసంలో పిసిసి మాజీ అధ్యక్షులు ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు చేస్తున్నటువంటి ఆమరణ నిరాహార దీక్షకు సంఘీభావం ప్రకటించిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పాల్గొని మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ జనాభాలో 60 శాతం పైగా ఉన్నటువంటి బీసీల న్యాయమైన డిమాండ్లను తీర్చడానికి కేంద్ర ప్రభుత్వానికి మనసొప్పడం లేదని రాత్రికి రాత్రి ఆగమేఘాల మీద అగ్రకులాలకు రిజర్వేషన్ల పేరుతో 10 శాతం రిజర్వేషన్లు తెచ్చినటువంటి కేంద్ర ప్రభుత్వం బీసీల న్యాయమైన డిమాండ్లను ఎందుకు పరిష్కరించడం లేదు.ఒక బిసి ప్రధాని అయి ఉండి బీసీలకు న్యాయం చేయకపోవడం సిగ్గు చేటని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బడే సాబ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి గుంటి మహేష్ ఉన్నారు.



## ఆదర్శ పాఠశాల విద్యార్థుల నైపుణ్యాల పెంపుకు ప్రత్యేక శిక్షణ: ప్రిన్సిపాల్ సుజాత



**మిర్యాలగూడ, మే 9:-( ప్రభాత సూర్య):** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సమ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దీన సుజాత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుండి 25 వరకు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు క్యాంపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించేందుకు స్పోర్ట్స్, గేమ్స్, స్టిచింగ్, మ్యూజిక్, యోగా, డ్రాయింగ్ వంటి వినోదాత్మక, శిక్షణాత్మక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్యాంపులో పాల్గొనే విద్యార్థులకు స్నాక్స్ అందించనున్నట్లు తెలిపారు. పీఎం శ్రీ పథకం కింద వేములపల్లి ఆదర్శ పాఠశాల సమ్మర్ క్యాంపు నిర్వహణకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు.

## ఇందిరమ్మ గృహప్రవేశాన్ని ప్రారంభించిన లింగాపూర్ సర్పంచ్ కాసెట్టి వీరేశం



**పెగడపల్లి మే 9 (ప్రభాత సూర్య):** పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన కాసెట్టి అంజమ్మ కు ప్రభుత్వం కేటాయించిన ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశాన్ని లింగాపూర్ సర్పంచ్ కాసెట్టి వీరేశం ప్రారంభోత్సవం చేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## తాజ్ కూల్ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన యాసర్ మౌలానా, డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ



**నల్గొండ ప్రభాత సూర్య:** నల్గొండ పట్టణ కేంద్రంలో మిర్యాలగూడ రోడ్ ఎస్ ఆర్ గార్డెన్ సమీపంలో శనివారం టాస్క్ కూల్ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంటును నల్గొండ డిప్యూటీ మేయర్ అమీర్ అష్రఫ్ అలీ, మహమ్మద్ ఇషాక్ అలీ యాసర్ మౌలానా, ఎస్.కె మాజీదు, ఆదిల్, ఘనంగా ప్రారంభించి మాట్లాడారు. నల్గొండ పట్టణంలో మొదటిసారిగా ఖనిజా లవణాలతో కూడిన సురక్షిత మంచినీటి సౌకర్యం తాజ్ కూల్ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ పట్టణ,గ్రామీణ ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందని, సాధారణ సురక్షిత నీరు, చల్లని సురక్షిత నీరు అందుబాటులో ఉంటాయని పెళ్లిళ్లకు, బర్త్డేలకు, ఇతర శుభకార్యాలకు ఈ యొక్క ప్యూరిఫైడ్ వాటర్ ను ఆటో ట్రాన్స్పోర్ట్ ద్వారా అందజేస్తామని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సజావుద్దీన్, షామీర్, జాకియోద్దీన్, యాసీన్, తదితరులు పాల్గొన్నారు

## టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య జన్మదిన వేడుకలు



**ప్రభాత సూర్య మాడుగుల పల్లి (మే 09)ప్రతినిధి :** మాడుగులపల్లి:మండల పరిధిలోని మాచనపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ యువజన నాయకులు కొండేటి సతీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ కొండేటి నరేష్, కొండేటి సైదయ్య నరసయ్య యాదయ్య ఇసాక్ శ్రీనయ్య సైదులు దర్శనం శ్రీను ఆకిటి అశోక్ శ్రీకాంత్ శ్రవణ్ కిరణ్ మహేందర్ అంజయ్య నవీన్ పల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### సంతలో కమ్యూనిటీ పోలీసింగ్ అవగాహన సదస్సు.. పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్




**పెబ్బేరు మే 9 ప్రభాత సూర్య:** వేసవి కాలంలో గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పెబ్బేరు ఎస్ఐ వెంకటేష్ గౌడ్ అన్నారు.దొంగతనాలు జరగకుండా గ్రామస్తులు జాగ్రత్తలు పాటించడం ఎంతో అవసరం అన్నారు. ఈ సందర్భంగా శనివారం పెబ్బేరు సంతలో ఉన్న ప్రజలకు కమ్యూనిటీ పోలీస్ అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు.ఇటీవల బైక్, సెల్ ఫోన్, పిక్ పాకెటింగ్ దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు దొంగల పట్ల జాగ్రత్త వహించాలని కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా ప్రజలకు సూచనలు చేశారు. అపరిచితులతో పరిచయాలు పెంచుకోవడం, లిఫ్ట్ ఇవ్వడం నివారించాలని సూచించారు. అలాగే గ్రామాలలో దొంగతనాలు జరగకుండా గ్రామస్తులు జాగ్రత్తలు పాటించడం ఎంతో అవసరం అన్నారు. ఇంటి ఆవరణలో, డాబాలపై నిద్రిస్తున్న సమయంలో కొంత అప్రమత్తంగా ఉండాలన్నారు. శుభకార్యాలకు, ఊరికి వెళ్లే సమయంలో పొరుగువారికి చెప్పడంతో పాటు విలువైన బంగారం, వెండి నగలు, నగదు ఇంట్లో కాకుండా బ్యాంక్‌లో భద్రపరచుకోవాలన్నారు. గ్రామంలో కొత్తగా కనిపించే అనుమానాస్పద వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రాత్రి వేళల్లో యువత గస్తీ నిర్వహించి ఒకరికొకరు సహాయం చేసుకునే విధంగా వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల కోసం పోలీస్ నంబర్లు అందరికీ తెలియపరచాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా గుండ్ల మాచునూర్ సర్పంచ్ శ్రీహరి జన్మదిన వేడుకలు



**ప్రభాత సూర్య నర్సాపూర్ మే09:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గుండ్ల మాచునూర్ గ్రామ సర్పంచ్ యువ డైనమిక్ లీడర్ బేగరి శ్రీహరి జన్మదిన వేడుకలు శనివారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.జన్మదినాన్ని పురస్కరించుకొని కేకు కట్ చేసి సర్పంచ్ శ్రీహరి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండ్ల మాచునూర్ యువ సర్పంచ్ చిరంజీవి శ్రీహరి నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలు,అష్టైశ్వర్యాలతో చల్లగా ఉండాలని కోరారు. అనంతరం సర్పంచ్ శ్రీహరి మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేసి తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపడం చాలా సంతోషంగా ఉందన్నారు.అదేవిధంగా తన జన్మదినం సందర్భంగా పార్టీలకతీతంగా నన్ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు .ఈ కార్యక్రమంలో సీనియర్ విలేకరి ఆంజనేయులు గౌడ్,అన్వర్,



దుర్గయ్య,రామస్వామి,శ్రీశైలం, నాగేష్,శంకర్, ఆంజనేయులు ,మహిపాల్ నాయకులు మాజీ ఎంపీ టి సి ల పోరం మండల అధ్యక్షులు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి శుభకార్యంలో ఆత్మీయత చాటుతున్న మాద్రి పృథ్వీరాజ్





**పటాన్చెరు, మే 9,ప్రభాత సూర్య :** పటాన్చెరు, బీరంగూడ ప్రాంతాల్లో జరుగుతున్న శుభకార్యాలకు ఆత్మీయంగా హాజరవుతూ ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటున్నారు బీఆర్ఎస్ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్. పదవులతో కాకుండా మనసుతో బంధాలను నిలబెట్టుకోవచ్చని ఆయన మరోసారి చాటిచెప్పారు. పటాన్చెరు పట్టణానికి చెందిన కాజు గురుస్వామి కుమారుడి వివాహ మహోత్సవానికి హాజరైన ఆయన, నూతన వధూవరులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యుడిలా కలిసిమెలిసి అందరితో ఆప్యాయంగా మాట్లాడి వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.నూతన దంపతులు ఆయురారోగ్యాలతో, ఆనందాలతో, సుఖశాంతులతో నిండిన దాంపత్య జీవితం గడపాలని ఆకాంక్షించారు.

## ఏటీఎంలో చోరీకి ప్రయత్నించి పట్టుబడ్డ నిందితులు



**మిర్యాలగూడ, మే 9:- (ప్రభాత సూర్య) :** దామరచర్ల ఎటీఎంలో చోరికి ప్రయత్నించి పట్టుబడ్డ ఇద్దరు నిందితుల విషయాన్ని మిర్యాలగూడ రూరల్ పోలీస్ సీఐ పిఎన్డి. ప్రసాద్ తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక రూరల్ పోలీసు స్టేషన్ లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం రామాపురం గ్రామవాసి ప్రస్తుతం జడ్చర్ల స్నేహ ఫుడ్స్ లో సూపెర్వైజర్ గా ఉన్న మోతుకూరి రమణ, అందులోనే సెక్యూరిటీ గార్డ్ గా ఉన్న ఏపీ రాష్ట్రనికి చెందిన వేరే మోహనకుమార్ రెడ్డి ఇద్దరు కలిసి వైటీపిఎస్ లో ఉద్యోగం కోసం దామరచర్ల వచ్చి ఆర్థిక ఇబ్బందులతో ఉన్న వారు ఎటీఎంలో చోరి ఎలా చేయాలో చూసి ఏప్రిల్ 23 రాత్రి 11:30 గంటలకు ఎటీఎంలోకి ప్రవేశించి షట్టర్ దించి మిషన్ పగుల గొట్టే యత్నం చేయగా సెక్యూర్టీ అలారం మోగడంతో ఫరారయ్యారు. పోలీసులకు దొరక్కుండా ఉండాలని జడ్చర్లలో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారని తెలిపారు. ఎటీ ఎంలోని సీసీ కెమెరా ఫుటేజ్ పోలీస్ స్టేషన్ లకు సర్క్యూలేట్ చేయగా రమేష్ గుర్తించి వాడపల్లి ఎస్ఐ సమాచారం ఇచ్చారు. శనివారం రామాపురంకు వచ్చి అద్దె ఇంట్లోని సామాను తీసుకుని వెళ్తున్నారని సమాచారం రావడంతో వాడపల్లి పోలీసులు పట్టుకున్నారని ఆయన తెలిపారు. నిందితులిద్దరినీ అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచగా జ్యూడిషియల్ కస్టడీకి తరలిస్తూ జెఎఫ్సిఎం ఆదేశాలిచ్చారు. నిందితులిద్దరి నుండి ఇనుప రాడ్డు స్మార్ట్ ఫోన్, నల్లటి కాలేజ్ బ్యాగ్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మిర్యాలగూడ డి ఎస్పీ కె. రాజశేఖర్ రాజు సూచనలతో సీఐ ప్రసాద్, వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, ఎఎస్ఐ జోజి, కాన్స్టేబుల్ సైదులు, హోంగార్డులు సంతోష్ రెడ్డి, యాదగిరిలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

## హిందూ దేవాలయాలపై జీఎస్టీ రద్దు చేయాలి

### భక్తుల మనోభావాలను గౌరవించాలి : కాంగ్రెస్ నాయకుడు గాదె శివ



**కూకట్ పల్లి, మే 09 (ప్రభాత సూర్య) :** హిందూ దేవాలయాల్లో దర్శనం, అర్చనలు, కొబ్బరికాయలు కొట్టడం వంటి ఆధ్యాత్మిక ఆచారాలపై జీఎస్టీ లేదా ఇతర పన్నులు విధించడం పట్ల భక్తుల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు గాదె శివ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మోడీ సార్, హిందూ దేవాలయాల్లో దర్శనం, అర్చనలు, కొబ్బరికాయలు కొట్టడంపైనా పన్నులు వేస్తే సాధారణ భక్తుడు ఎలా భక్తి చేయగలడు? హిందూ సోదరుల మనోభావాలను గౌరవించి దేవాలయాలపై జీఎస్టీ విధానాన్ని పునరాలోచించాలి" అని కోరారు. దేవాలయాలు వ్యాపార కేంద్రాలు కాదని, అవి భక్తి, సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలని ఆయన పేర్కొన్నారు. ఇతర మత ప్రార్థనా స్థలాల విషయంలో ఇలాంటి పరిస్థితులు కనిపించకపోతే, హిందూ దేవాలయాలపై మాత్రమే పన్నుల భారం పడుతోందనే భావన భక్తుల్లో కలుగుతోందన్నారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కేవలం హిందుత్వ పేరుతో రాజకీయాలు చేసే బిజెపి నాయకులు ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని గాదె శివ సూచించారు. హిందూ భక్తుల మనోభావాలను గౌరవిస్తూ దేవాలయాలపై జీఎస్టీ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# మిర్యాలగూడ ప్రజలను వీడని ట్రాఫిక్ ఇబ్బందులు

## డివైడర్ ల పేరుతో పట్టణాన్ని రెండుగా విభజించవద్దు.. ప్రజాధనం దుర్వినియోగం చేయకండి

**మిర్యాలగూడ, మే 9:-( ప్రభాత సూర్య) :** కోదాడ - జడ్చర్ల హైవే కోసం మిర్యాలగూడ పట్టణం మధ్య నుంచి నిర్మిస్తున్న డివైడర్ నిర్మాణం వల్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ స్థితిలో మే 7వ తేదీ ఉదయం, సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో వివిధ పార్టీలు, వర్గాల ప్రజలతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది.పట్టణం నడిబొడ్డున ఏర్పాటు చేస్తున్న డివైడర్ వల్ల పట్టణ ప్రజలు ట్రాఫిక్ వలయంలో ఇబ్బందులు పడతారని, పట్టణంలోని ముఖ్య కూడళ్ళలో గతంలో ఉన్నట్టుగానే యు టర్న్ లు వదిలి సమస్యను పరిష్కరించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు ఏకగ్రీవంగా అభిప్రాయంతో ఎమ్మెల్యేకు వినిపించారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు, వాణిజ్య వర్గాలు, సామాజిక వేత్తలు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి కూడా సమావేశంలో పాల్గొని, సమస్య తమ పార్టీ ఎమ్మెల్యే దృష్టిలో ఉందని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తారని అన్నారు. ఇదిలా ఉండగా, మే 7 న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గారు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి లకు సంబంధిత ఉన్నతాధికారులకు కోదాడ - జడ్చర్ల హైవే ను పట్టణం గుండా రాకుండా రీ అలైన్మెంట్ చేసి, ప్రజలకు భద్రత కలిగించాలని మెమొరాండాలు ఇవ్వడం జరిగింది. దీంతో సమస్య పరిష్కారం అయినట్టేనని పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కానీ ప్రస్తుత పరిణామాలు మళ్లీ మొదటికే వచ్చాయి.





**సమస్య మళ్ళీ మొదటికేనా..?**

మే 8న రాత్రి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గ మిర్యాలగూడ వన్ టౌన్, టూ టౌన్ సి ఐ లు, సిబ్బందితో కలిసి పట్టణంలో నిర్మిస్తున్న డివైడర్లను పరిశీలించినట్టు, పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు అదనపు పోలీస్ సిబ్బందిని కేటాయించాలని ఫోన్ లో జిల్లా ఎస్పీని కోరినట్టు సామాజిక మాధ్యమాల్లో వార్తలు వెలువడ్డాయి. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే, నేషనల్ హైవే నిబంధనలు, పట్టణ మాస్టర్ ప్లాన్ లో భాగంగా చేపడుతున్న ఈ చర్యలు పట్టణ రూపు రేఖలు మారుస్తాయని ఎమ్మెల్యే బత్తుల సన్నిహితులు సామాజిక మాధ్యమాల్లో వార్తలు పోస్ట్ చేయడం హర్షణీయం.. నేషనల్ హైవే అథారిటీ అధికారులకు హైవే సాంకేతిక డిజైన్ కు సంబంధించి ఇంజనీరింగ్ నిబంధనలు ఉంటాయనే విషయంలో ఎవరికి సందేహం అవసరం లేదు. అయితే ఇపుడు మిర్యాలగూడ పట్టణం నడిబొడ్డున నిర్మిస్తున్న దాదాపు మూడు అడుగుల ఎత్తు డివైడర్ కు నేషనల్ హైవే అథారిటీ కి సంబంధం లేదు. నేషనల్ హై అథారిటీ రోడ్ ఇంజినీరింగ్ నిబంధనలకు, డిజైన్ కు పట్టణంలో జరిగిన రోడ్ వైడెనింగ్, డివైడర్ నిర్మాణం సాంకేతికంగా ప్రామాణికం కాదు. డివైడర్ నిర్మాణం కోసం వ్యయం చేస్తున్న సొమ్ము పట్టణ మాస్టర్ ప్లాన్ లో భాగమే అయితే కావచ్చు కానీ యథాతథ స్థితిలో పట్టణాన్ని రెండుగా విభజించే డిజైన్ వల్ల పట్టణ ప్రజలతో పాటు (ఎమ్మెల్యే గారి అంచనా ప్రకారమే) పరిసర ప్రాంతాల నుంచి రోజు పట్టణంలోకి వచ్చే యాభై వేల మంది ట్రాఫిక్ చక్రబంధంలో తీవ్రంగా అవస్థలు పడతారు. అందువల్ల 7వ తేదీన ఎమ్మెల్యే బత్తుల, మంత్రులకు అధికారులకు ఇచ్చిన మెమొరాండం మేరకు కోదాడ - జడ్చర్ల హైవే ను పట్టణం వెలుపలి నుంచి మళ్లించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలి. ఇందుకు ఎమ్మెల్యే గారు కోరినట్టు రీ - అలైన్మెంట్ అవసరమే కానీ అది భారీ ప్రాజెక్ట్ అయితే కాదు, పట్టణంలోని ఈదులగూడెం చెంతనే ఉన్న అద్దంకి హైవే ద్వారా హనుమాన్ పేట (ఫ్లై ఓవర్) బైపాస్ దగ్గర ఉన్న జడ్చర్ల హైవేకు కలిపితే సరిపోతుంది. ఈ క్రమంలో ట్రాఫిక్ క్రమద్దీకరణ పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా పట్టణ ప్రణాళిక కొనసాగాలి.

మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డు మధ్యన మున్సిపల్ పాలక వర్గం, గతంలో ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఆ తర్వాత పాలక వర్గం ఆ ఐరన్ గ్రిల్ (డివైడర్) తొలగించి సిమెంట్ దిమ్మలతో డివైడర్ ఏర్పాటు చేయడం జరిగింది.(ఆయా పనులు ఏ పార్టీ పాలక వర్గంలో చేశారనే చర్చ ఇపుడు అవసరం లేదు.) ఇదిలా ఉంటే, తాజాగా సిమెంట్ కాంక్రీటు దిమ్మె నిర్మాణం చేసి గ్రానైట్ రాళ్లతో గోడ కట్టుబడి చేస్తున్నారు. అంతకు ముందు ఉన్న కాంక్రీట్ డివైడర్ దిమ్మెలు తొలగించి , సాగర్ రోడ్డు దగ్గర, మరో చోటనో కుప్ప వేశారు. ఆ దిమ్మెలకు చక్కగా పెయింట్ తో చారలు కూడ వేయించారు. అవి దృఢంగానే ఉండే.. తొలగించిన ఆ దిమ్మెలు గత వారం రోజుల నుంచి కన్పించకుండా మాయమైపోయాయి.

పట్టణ ప్రణాళిక పేరుతో ప్రజలు పన్నుల రూపంలో కట్టిన ప్రజా ధనాన్ని రాళ్లపాలు చేయకుండా, కాంట్రాక్ట్ ప్రయోజనాల కోసం వెచ్చించకుండా ప్రజల్లో చైతన్యం రావాలి. ఈ నేపథ్యంలో పట్టణాభివృద్ధి పేర కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ప్రజాప్రతినిధులు కృషి చేయాలి. మళ్ళీ ఏదో ఒక నెపంతో నేషనల్ హైవే రూల్స్ అని పట్టణ మాస్టర్ ప్లాన్ అని , ప్రజలు అలవాటు పడాలని శుష్క వచనాలు పలుకకుండా గట్టి మేలు తలపెట్టాలి. గతంలో మాదిరిగానే మిర్యాలగూడ పట్టణ ముఖ్య కూడళ్ళలో యూటర్న్ పునరుద్ధరించాలని పట్టణ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

# ధర్మారెడ్డి కాలనీలో ఘనంగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం





- సామాజిక బాధ్యతతో ఈ శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయ
- టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్

**కూకట్‌పల్లి, మే 09 (ప్రభాత సూర్య) :** కూకట్ పల్లి నియోజకవర్గం, వసంతనగర్ డివిజన్ పరిధిలోని ధర్మారెడ్డి కాలనీ ఫేజ్-2లో బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో, బండి రమేష్ సహకారంతో, మాకినేని యాకనారాయణ (వినోద్) - విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం అత్యంత విజయవంతంగా ముగిసింది. కూకట్‌పల్లిలోని వివిధ కాలనీల నుండి సుమారు 230 మంది ప్రజలు తరలివచ్చి ఈ ఉచిత వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారు.

**వైద్య సేవలపై ప్రశంసలు**

బసవతారకం ఆసుపత్రి వైద్య బృందం రోగులకు ఓపికగా పరీక్షలు నిర్వహించి, వారి సందేహాలను నివృత్తి చేస్తూ అందించిన సేవలు ప్రజల మన్ననలు పొందాయి.

అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన మాకినేని యాకనారాయణ (వినోద్)ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అరవింద్ రెడ్డి, తుమ్మ వేణు, చావ శ్రీనివాస్, కిలారు శ్రీనివాస్ బాబు, కామినేని వాసు, సాయితులసి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సేవా కార్యక్రమాల కొనసాగింపుగా, ఈ నెల 17వ తేదీన భగత్ సింగ్ నగర్ ఫేజ్-2, వినాయక మండపం వద్ద జరగనున్న రెండవ క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.మాకినేని వినోద్ మాట్లాడుతూ ఈ శిబిరం విజయవంతం కావడానికి సహకరించిన ధర్మారెడ్డి కాలనీ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కాలనీ వాసులకు, బసవతారకం ఆసుపత్రి యాజమాన్యానికి, వాలంటీర్లకు ధన్యవాదాలు తెలియజేస్తూ.. భవిష్యత్తులో కూడా మీ అందరి ఆశీస్సులు ఉండాలని కోరారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన వంగపల్లి అంజయ్య స్వామి ....

**ఆలేరు మే 9 ప్రభాత సూర్య:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం కాచారం శ్రీ వాసవి రేణుక బసవలింగేశ్వర స్వామి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి సిద్ధిపేటలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులు శ్రీకాంత్, శ్రీదివ్య దంపతులను ఆశీర్వదించి, నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారి అనుగ్రహం కలకాలం ఉండాలని కోరుకుంటూ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి లడ్డు ప్రసాదం అందజేశారు.



# దీనబంధు కాలనీ లో వైయస్సార్ విగ్రహాన్ని ఢీకొట్టిన కారు

## దెబ్బతిన్న వైఎస్ఆర్ విగ్రహం...

## ఆగ్రహం వ్యక్తం చేసిన వైఎస్ఆర్ అభిమానులు



**కూకట్ పల్లి, మే 09 (ప్రభాత సూర్య):** శేరిలింగంపల్లి నియోజకవర్గం, వెంకటేశ్వర నగర్ డివిజన్ పరిధిలోని దిన బంధు కాలనీ చౌరస్తాలో ఉన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని శనివారం గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. దీంతో వైయస్సార్ అభిమానులు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఈ ఘటనపై జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో వైయస్సార్ అభిమానులు ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ వెంకటేశం వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని సిసి ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు జరిపి వైయస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ అభిమాని ఆనంద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందుల శివకుమార్, శ్రీధర్ పటేల్, ప్రగతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మాచర్ల విష్ణు, ఎస్ పరశురాం, బాలు వైయస్సార్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# తాజ్ కూల్ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించిన యాసర్ మౌలానా, డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ



**నల్గొండ ప్రభాత సూర్య:** నల్గొండ పట్టణ కేంద్రంలో మిర్యాలగూడ రోడ్ ఎస్ ఆర్ గార్డెన్ సమీపంలో శనివారం టాస్క్ కూల్ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంటును నల్గొండ డిప్యూటీ మేయర్ అమీర్ అష్రఫ్ అలీ, మహమ్మద్ ఇషాక్ అలీ యాసర్ మౌలానా, ఎస్.కె మాజీదు, ఆదిల్, ఘనంగా ప్రారంభించి మాట్లాడారు. నల్గొండ పట్టణంలో మొదటిసారిగా ఖనిజా లవణాలతో కూడిన సురక్షిత మంచినీటి సౌకర్యం తాజ్ కూల్ ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ పట్టణ,గ్రామీణ ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందని, సాధారణ సురక్షిత నీరు, చల్లని సురక్షిత నీరు అందుబాటులో ఉంటాయని పెళ్లిళ్లకు, బర్తేలకు, ఇతర శుభకార్యాలకు ఈ యొక్క ప్యూరిఫైడ్ వాటర్ ను ఆటో ట్రాన్స్పోర్ట్ ద్వారా అందజేస్తామని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సజావుద్దీన్, షామీర్, జాకియోద్దీన్, యాసీన్, తదితరులు పాల్గొన్నారు

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సుధగాని హరి శంకర్ గౌడ్ ...

**ఆలేరు మే 9 ప్రభాత సూర్య.. :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని రఘునాథపురం గ్రామ వాస్తవులు మాచర్ల నామ్ దేవ్ -లక్ష్మి దంపతుల కుమార్తె ను గౌరాయపల్లి లో గౌరా రెడ్డి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన వివాహ వేడుకల్లో సుదగాని ఫౌండేషన్ చైర్మన్ సుధగాని హరి శంకర్ గౌడ్ పాల్గొని నూతన వధూవరులు రేఖ సాయికుమార్ దంపతులను ఆశీర్వదించి, నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని లక్ష్మీ నరసింహ స్వామి అనుగ్రహం కలకాలం ఉండాలని ఆశీర్వదించారు.





## కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక: తొలి ఆరు నెలల్లో..

కేంద్ర ప్రభుత్వం వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల కాలానికి (2026--27 ఏప్రిల్-సెప్టెంబర్) రూ.8 లక్షల కోట్ల రుణాలను మార్కెట్ నుంచి సమీకరించే ప్రణాళికతో ఉంది. ఆదాయం లోటును పూడ్చుకునేందుకు డేటెడ్ సెక్యూరిటీల జారీ ద్వారా ఈ మేరకు నిధులను సమకూర్చుకోనుంది. 2026--27 ఆర్థిక సంవత్సరంలో రూ.17.20 లక్షల కోట్లను మార్కెట్ నుంచి నిధుల రూపంలో సమకూర్చుకోవాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొంది. బడ్జెట్ సమర్పణ అనంతరం, ప్రభుత్వ సెక్యూరిటీల (జీసెక్) మార్పిడి ప్రక్రియలు నిర్వహించడంతో స్థూల మార్కెట్ రుణాలు రూ. 16.09 లక్షల కోట్లకు తగ్గాయని తెలిపింది. "రూ.16.09 లక్షల కోట్లకు గాను రూ.8.20 లక్షల కోట్లను (మొత్తం లక్ష్యంలో 51%) మొదటి ఆరు నెలల్లో డేటెడ్ సెక్యూరిటీల ద్వారా సమీకరించనున్నాం.ఇందులో రూ.15,000 కోట్లు సావరీన్ గ్రీన్ బాండ్ల జారీ కూడా ఉంటుంది. 2026--27లో వాస్తవ ద్రవ్యలోటు రూ.16.9 లక్షల కోట్లుగా ఉంటుంది. ఈ లోటును భర్తీ చేసుకునేందుకు డేటెడ్ సెక్యూరిటీల జారీ ద్వారా మార్కెట్ నుంచి నికర రుణ సమీకరణ రూ.11.7 లక్షల కోట్లుగా ఉంటుంది. మిగిలిన మొత్తం చిన్న మొత్తాల పొదుపు నిధులు, ఇతర వనరుల రూపంలో సమకూర్చుకోనున్నాం" అని ఆర్థిక శాఖ తెలిపింది.

## ఇక మేడిన్ ఇండియా సీసీ కెమెరాలదే రాజ్యం!



న్యూఢిల్లీ: దిగుమతి చేసుకున్న, సర్టిఫై చేయని యూనిట్లపై నిషేధంతో సీసీటీవీ కంపెనీలు ఏప్రిల్ దేశీయంగా తయారు చేసిన ఉత్పత్తుల విక్రయాలను ప్రారంభించాయి. హిక్‌విజన్, టీపీ--లింక్‌లాంటి చైనీస్ సీసీటీవీ కంపెనీలపై దీనితో ప్రభావం పడిందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. స్టాండర్డైజేషన్ టెస్టింగ్, క్వాలిటీ సర్టిఫికేషన్ (ఎస్‌టీక్యూసీ) నిబంధనల అమలుతో సర్వైలెన్స్ పరిశ్రమ స్వరూపం మారినట్లు సీపీ ప్లస్ బ్రాండ్ సీసీటీవీలను తయారు చేసే ఆదిత్య ఇన్ఫోటెక్ వెల్లడించింది. ఎస్‌టీక్యూసీ లేని సీసీటీవీ యూనిట్ల విక్రయాన్ని 2025 ఏప్రిల్ 9 నుంచి కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ నిషేధించింది. అయితే అప్పటికే దిగుమతి చేసుకున్న ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ఈ ఏడాది మార్చి 31 వరకు వీలు కల్పించింది. దీనితో పలు సంస్థలు దేశీయంగా ఉత్పత్తిపై మరింత దృష్టి సారించాయి.

## టఫే ట్రాక్టర్లకు డిమాండ్




న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 : ట్రాక్టర్లు, వ్యవసాయ ఉత్పత్తుల తయారీ సంస్థ టఫే ట్రాక్టర్లకు ఎనలేని డిమాండ్ నెలకొన్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 2,14,961 యూనిట్ల వాహనాలు అమ్ముడయ్యాయి. కిందటేడాది 1,74,785 యూనిట్ల వాహనాలను విక్రయించింది. కంపెనీ చరిత్రలో ఒక నెలలో ఇంతటి స్థాయిలో పుంజుకోవడం విశేషమని కంపెనీ వైస్ చైర్మన్ లక్ష్మి వేణు తెలిపారు. జీఎస్టీని తగ్గించడంతో వ్యవసాయ రంగం రాణించడం కలిసొచ్చింది.

## బీఎఫ్ఎస్ఐలో నకిలీల బాగోతం




న్యూఢిల్లీ: బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగంలో ఉద్యోగార్థులు దాఖలు చేసే ప్రతి 10 దరఖాస్తుల్లో ఒకటికిపైగా తప్పుడు సమాచారంతోనే ఉంటున్నాయని ఓ తాజా నివేదికలో తేలింది. వేతనం, అనుభవం, గత సంస్థల నుంచి ఎందుకు బయటకు వచ్చారు? వంటి వివరాల్లో దరఖాస్తుదారులు అసలు నిజం చెప్పట్లేదని బిజినెస్ ఇంటెలిజెన్స్ సంస్థ ఆథ్‌బ్రిడ్జ్ తమ రిపోర్టులో పేర్కొన్నది.గత ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రథమార్ధం (ఏప్రిల్-సెప్టెంబర్)లో నకిలీ సర్టిఫికెట్లు, డిగ్రీలతోపాటు యూజీసీ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టిన ఇన్‌స్టిట్యూషన్లను పేర్కొనడం సర్వసాధారణంగా కనిపించిందంటూ 'వర్క్‌ఫోర్స్ ఫ్రాడ్ ఫైల్స్' పేరిట రూపొందించిన ఈ నివేదిక స్పష్టం చేసింది. కాగా, ఇన్-హౌస్ వెరిఫికేషన్ ప్లాట్‌ఫామ్‌ను వినియోగించి గత ఏడాది ఏప్రిల్-సెప్టెంబర్ మధ్య లక్షలాది వైట్ కాలర్, గిగ్ వర్కర్స్ డాటాను పరిశీలించామని ఆథ్‌బ్రిడ్జ్ వ్యవస్థాపక సీఈవో అజయ్ ట్రెహాన్ ఈ సందర్భంగా వెల్లడించారు




## పెరిగిన మహీంద్రా కార్ల ధరలు

దేశీయ వాహన తయారీ దిగ్గజం.. మహీంద్రా అండ్ మహీంద్రా ఎస్‌యూవీ, కమర్షియల్ వాహనాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. కొత్త ధరలు ఏప్రిల్ 6 నుంచి అమల్లోకి రానున్నట్లు సంస్థ వెల్లడించింది. ధరలు గరిష్టంగా 2.5 శాతం వరకు పెరగనుండగా, అన్ని వాహనాలపై సగటున 1.6 శాతం పెరుగుదల ఉంటుంది. పెరుగుతున్న ముడిసరుకుల ఖర్చులు, మొత్తం వ్యయాల మొదలైన కారణాల వల్లనే ధరల పెంపు జరిగిందని కార్ల తయారీ సంస్థ పేర్కొంది. దీంతో శఖఎ 3ఎక్స్ఓ ఈవీ, ఎక్స్ఈవీ 9ఎస్, బీఈ 6, ఎక్స్ఈవీ 9ఈ ఎలక్ట్రిక్ కార్ల ధరలు పెరగనున్నాయి. కొత్త ధరలో త్వరలోనే వెల్లడవుతాయి. థార్, స్కార్పియో ఎన్, ఎక్స్‌యూవీ 7ఎక్స్ఓ వంటి జనాదరణ పొందిన మోడళ్ల ధరలు 2.5% వరకు పెరగనున్నాయి. మహీంద్రా శఖఎ7శూ ధరల సవరణ మొదటి 40,000 బుకింగ్‌ల డెలివరీ తర్వాత జరుగుతుంది. ధరల పెరుగుదల జరిగినప్పటికీ.. కారు ఫీచర్లు లేదా మెకానికల్ స్పెసిఫికేషన్లలో ఎలాంటి మార్పులు ఉండవు.

## శ్రీ అవని అనురాగ్ హాస్పిటల్, రిహాబిలిటేషన్ కేంద్రము ప్రారంభం

**పేద ప్రజలకు కార్పొరేటర్ వైద్యం అందించాలి - డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**




**నల్గొండ ప్రభాత సూర్య :** ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో చైతన్యపూర్ మైసమ్మ గుడి చైతన్య జూనియర్ కళాశాల సమీపంలో హనుమాన్ నగర్ లో శనివారం అవని అనురాగ్ హాస్పిటల్, రిహాబిలిటేషన్ కేంద్రమును ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు దాసోజు శ్రవణ్ కుమార్, భారత రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అవని అనురాగ్ హాస్పటల్ నిర్వాహకులు శంకరాచారి లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలని, వివిధ రకాల చికిత్సలు, వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని నిరంతరం అనుభవం కలిగిన డాక్టర్లతో పర్యవేక్షణ ఉంటుందని, వైద్యం ఒక సేవ లాగా భావించాలని సూచించారు, అంతేకాకుండా దీర్ఘకాలిక వ్యాధులు నయం చేసుకునే వీలుగా రిహాబిలిటేషన్ కేంద్రము కూడా అందుబాటులో ఈ హాస్పిటల్ లో ఉంటుందని తెలిపారు. బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం, మానసిక రుగ్మతుల రోగులకు నయం చేసుకోవడానికి అవని అనురాగ్ హాస్పటల్, ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ, పొర్ల గడ్డ తండా సర్పంచ్ రాజు నాయక్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాశం ఉపేందర్ రెడ్డి, వావిలపల్లి మాజీ సర్పంచ్ జక్కర్తి పాపయ్య, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బెల్లంకొండ నరసింహ, తండ యాదయ్య, బొంగు బుచ్చయ్య, మంచాల బాలరాజు, గడ్డం ముత్యాలు, గడ్డం నరేష్, బెల్లంకొండ సాయి, మల్లేష్ యాదవ్, శ్రేయోభిలాషులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ 2వీలర్స్ స్పీడ్

అమ్మకాలుఏ 13.5 లక్షలు
టాప్ ర్యాంక్‌లో టీవీఎస్
బజాజ్ ఆటో, ఏథర్ సైతం




ద్విచక్ర ఎలక్ట్రిక్ వాహన(ఈవీ) అమ్మకాలు గత ఆర్థిక సంవత్సరంలో ఒక్కసారిగా స్పీడందుకున్నాయి. ఇందుకు ద్విచక్ర వాహన దిగ్గజాలకుతోడు ఏథర్ ఎనర్జీ తదితర కంపెనీలు ఈవీ 2వీలర్స్ ఉత్పత్తిలోకి ప్రవేశించడం దోహదపడుతోంది. వెరసి రెండు రోజులు తక్కువగా 2025--26లో ద్విచక్ర ఈవీ అమ్మకాలు 17 శాతంపైగా జంప్ చేశాయి. 13.5 లక్షల యూనిట్లను అధిగమించాయి. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు కొద్ది రోజులుగా డిమాండ్ పెరుగుతోంది. ఇందుకు దేశీ ద్విచక్ర వాహన రంగ దిగ్గజాలు బజాజ్ ఆటో, టీవీఎస్, హీరో మోటోలకు తోడు ఏథర్ ఎనర్జీ, ఓలా ఎలక్ట్రిక్ తదితర కంపెనీలు జత కలవడం పరిశ్రమకు జోష్ నిస్తున్నట్లు ఆటో రంగ నిపుణులు పేర్కొన్నారు. పెరుగుతున్న డిమాండుకుతోడు పోటీ తీవ్రత నేపథ్యంలో 2వీలర్ కంపెనీలు సైతం మరిన్ని సౌకర్యాలు, సాంకేతికతలతో విభిన్న మోడళ్లను ప్రవేశపెట్టడం ద్వారా వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. వెరసి గతేడాది (2025 ఏప్రిల్ 1--2026 మార్చి 29) ద్విచక్ర ఈవీ కంపెనీలు ఉమ్మడిగా 13.5 లక్షల యూనిట్లను విక్రయించాయి. ఇది అంతక్రితం ఏడాది (2024--25)తో పోలిస్తే 17.3% వృద్ధికాగా.. 15 లక్షల యూనిట్ల విక్రయ మైలురాయిని అందుకునే వీలున్నట్లు ఆటో రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. గతేడాది 11 లక్షల యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి.

**రేసుకు సై..**

ద్విచక్ర ఈవీలలో టీవీఎస్ మోటార్ 3.3 లక్షల వాహన అమ్మకాలతో టాప్ చెయిర్‌ను అందుకుంది. తద్వారా 3 లక్షల వాహన అమ్మకాలను అధిగమించిన రెండో దిగ్గజంగా నిల్చింది. ఇప్పటికే ఈ రికార్డును సాధించిన ఓలా ఎలక్ట్రిక్ రేసులో వెనుకబడటం గమనార్హం!

స్కూటర్ల నుంచి మోటార్ సైకిళ్ల దిగ్గజంగా ఆవిర్భవించిన బజాజ్ ఆటో.. 'చేతక్' బ్రాండుతో ఈవీ ద్విచక్ర వాహనాలను విక్రయిస్తున్న సంగతి తెలిసిందే. తద్వారా రేసులో ముందుకొస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకూ రిటైల్‌గా 2.76 లక్షల వాహనాలను విక్రయించి రెండో ర్యాంకును అందుకుంది. ఇక పూర్తి ఈవీ కంపెనీ ఏథర్ ఎనర్జీ సైతం పటిష్ట మోడళ్లతో పోటీ పడుతోంది. ఐక్యూబ్ మోడల్ ద్వారా ఎలక్ట్రిక్ 2వీలర్ అమ్మకాలలో టాప్‌లో నిలిచిన టీవీఎస్ మోటార్ వార్షికంగా 39 శాతం పురోగతిని సాధించింది. తద్వారా 3 లక్షల వాహన విక్రయాల మార్క్‌ను అందుకుంది. ఇక హీరో మోటో.. 'విడా' బ్రాండ్ అమ్మకాలు ఏకంగా 184 శాతం జంప్‌చేశాయి. రిట్జా బ్రాండ్‌తో ఏథర్ ఎనర్జీ సైతం 75 శాతం వృద్ధిని అందుకుంది. మొత్తం ఈవీ 2వీలర్ అమ్మకాలలో ఐక్యూబ్, చేతక్, రిట్జా ఉమ్మడిగా దాదాపు 70 శాతం వాటా ఆక్రమిస్తున్నాయి. వీటితో హీరో మోటోను సైతం కలుపుకుంటే వినియోగదారులు పంపిణీ, సరఫరా నెట్‌వర్క్, సర?వసింగ్ సౌకర్యాలు, బ్రాండ్ తదితరాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పరిశ్రమ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ప్రధాన కంపెనీలతో పోటీ, ఇతర సవాళ్ల కారణంగా మరోపక్క వోలా ఎలక్ట్రిక్ విక్రయాలు 53 శాతం పడిపోయాయి. గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ(యాంపియర్), హోండా, రివర్ మొబిలిటీ, బిగౌస్ తదితర కంపెనీలు సైతం అమ్మకాలు వేగంగా పెంచుకుంటుండటం గమనార్హం. కాగా.. రేటింగ్స్ దిగ్గజం క్రిసిల్ అంచనాల ప్రకారం ఈవీ 2వీలర్ అమ్మకాల పరిమాణం కొత్త ఏడాది(2026--27)లోనూ 20 శాతంపైగా పుంజుకోనుంది. మొత్తం అమ్మకాలు 18 లక్షల యూనిట్లకు చేరుకునే అవకాశంఉంది.

# పెట్రోలే కాదు.. తాగే నీటిపైనా యుద్ధం ఎఫెక్ట్!

రష్యా-ఉక్రెయిన్ తర్వాత ఇప్పుడు ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు కేవలం ఇంధన ధరలనే కాదు, సామాన్యుడు తాగే నీటిని కూడా ఖరీదైనవిగా మారుస్తున్నాయి. హోర్ముజ్ జలసంధి గుండా రవాణాకు అంతరాయం కలగడంతో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 119 డాలర్లకు చేరడం భారత్‌లో బాటిల్ వాటర్ ధరల పెరుగుదలకు ప్రధాన కారణమైంది.

**ప్యాకేజింగ్ భారం**

నీటి ధర పెరగడానికి కారణం నీరు కాదు, ఆ నీటిని నింపే ప్లాస్టిక్ బాటిల్. ప్లాస్టిక్ తయారీకి వాడే ౹ాజు (పాలిథిలిన్ టెరెఫ్తాలేట్) రెసిన్ గుళికలు ముడి చమురు నుండి తయారవుతాయి. చమురు ధరలు పెరగడంతో, ఈ ముడిపదార్థాల ధరలు గత పక్షం రోజుల్లోనే భారీగా పెరిగాయి. మార్కెట్ లీడర్ బిస్లేరి ఇప్పటికే వాటర్ బాటిళ్ల ధరలను 11 శాతం పెంచింది. 12 లీటర్ బాటిళ్ల బాక్స్ ధర ఏకంగా రూ. 24 పెరిగింది. ప్యాకేజింగ్ ఖర్చులు 70 శాతం పెరగడంతో లీటర్ బాటిల్ ధర రూ. 20కి చేరుకుందని బిస్లేరి సీఈఓ




ఏంజెలో జార్జ్ తెలిపారు. ౹ాజు ప్రిఫార్మ్ ధర కిలోకు రూ. 115 నుండి రూ. 180కి పెరగడమే కాకుండా, సరఫరాలో తీవ్ర కొరత ఏర్పడిందని మహారాష్ట్ర బాటిల్డ్ వాటర్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ తెలిపింది.

**పరిశ్రమలపై 'చైన్ రియాక్షన్'**

కెమ్కో ప్లాస్టిక్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ వైభవ్ సరోగి అభిప్రాయం ప్రకారం, ఈ ప్యాకేజింగ్ సెగ కేవలం తాగునీటికే పరిమితం కాదు. ౹ాజు ప్యాకేజింగ్‌ను ఎక్కువగా ఉపయోగించే సాఫ్ట్ డ్రింక్స్, ఫుడ్ డెలివరీ, ఫార్మాస్యూటికల్స్, కాస్మెటిక్స్ రంగాలు కూడా ప్రభావితం కానున్నాయి.

**సామాన్యుడిపై నీటి భారం**

భారతదేశంలో స్వచ్ఛమైన నీటి లభ్యత ఇప్పటికే సవాలుగా మారింది. దేశంలో దాదాపు 70 శాతం భూగర్భ జలాలు కలుషితమయ్యాయని నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో పట్టణాల్లో 15 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 6 శాతం గృహాలు తమ ప్రాథమిక దాహం తీర్చుకోవడానికి బాటిల్ వాటర్ పైనే ఆధారపడుతున్నాయి.

**కర్మాగారాల మూసివేత**

పెరిగిన ఖర్చులను భరించలేక మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో దాదాపు 20 శాతం తయారీ ప్లాంట్లు తాత్కాలికంగా ఉత్పత్తిని నిలిపివేశాయి. యుద్ధం ఇలాగే కొనసాగితే, రానున్న రోజుల్లో బాటిల్ వాటర్ ధరలు మరింత భారమయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.